ప్రజాశక్తి
గురువారం 1 జనవరి 2026
5
అనంతపురం

నూతన సంవత్సర శుభాకాంక్షలు : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలను సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప తెలియజేశారు. బుధవారం నాడు గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరంలో జిల్లాలో రైతులు, కూలీలు, కార్మికులు, కష్టజీవులు వారి సమస్యలపై పోరాటాలను నిర్వహించారన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారు. ఈ కాలంలో ప్రజా వ్యతిరేకమైన చట్టాలను ఎన్డీఏ తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు తీసుకొచ్చాయి. లేబర్ కోడ్స్ రద్దు, మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం, కార్మికులకు కనీస వేతనాలు రైతులకు పంటలకు గిట్టుబాటు ధర పెట్టుబడి రాయితీ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసమే కొత్త సంవత్సరంలో మరింత సమరశీలమైన పోరాటాలను నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పోరాటాలతోనే కార్మికులు, కష్టజీవులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. 2026 సంవత్సరంలో ప్రజలందరి సమస్యలపై సిపిఎం చేసే పోరాటాలకు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు.

◆ అంబరాన్నంటిన న్యూ ఇయర్ సంబరాలు

◆ కేక పుట్టించిన కేకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో న్యూ ఇయర్ సంబరాలు అంబరాన్ని అంటే విధంగా సాగాయి. బుధవారం రాత్రి 2025కు వీడ్కోలు పలుకుతూ 2026 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పెద్దఎత్తున సంబరాలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగాయి. న్యూఇయర్ వేడుకల కోసం కొన్ని చోట్ల ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి. హోటళ్లు, బేకరీలు, స్వీట్‌షాపులు, ప్రత్యేకంగా అలకరించారు. ప్రత్యేక ఆఫర్లు కూడా ప్రకటించాయి. కొన్ని ఈవెంట్ సంస్థలు సినీ ప్రముఖులతో ప్రత్యేకమై కార్యక్రమాలు రూపొందించారు. రాత్రి పది గంటల తరువాత ప్రధాన రహదారులపై వచ్చేందుకు వీల్లేదని పోలీసులు హెచ్చరికల నేపథ్యంలో తమకు అనుకూలమైన ప్రాంతాల్లో ప్రత్యేకమైన విందు ఏర్పాట్లు చేసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు కూడా పెద్ద ఎత్తున పోలీసులు నిర్వహించారు. దీంతో మద్యం సేవించిన వారు ప్రధాన రహదారుల్లో కాకుండా ప్రత్యేకమైన మార్గాల్లో వెళ్లి తప్పించుకునే ప్రయత్నాలు చేశారు.

అనంతపురంలో స్వీట్ల దుకాణంలో జనాల రద్దీ

కేక పుట్టించిన కేకులు

కొత్త సంవత్సరం కేకుల హడావుడి అంతా.. ఇంతా కాదు. ప్రధానమైన పట్టణాలు, నగరాల్లోని బేకరీల్లో ఆర్డర్లు కేక పుట్టించాయి. బుధవారం రాత్రి 12 గంటల సమయంలో కేకులు కట్ చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకునేందుకు యువతే కాకుండా కొంత మంది సాధారణమైన ఇళ్లలోనూ సంబరాలు జరుపుకున్నారు. కేకుల్లో న్యూఫ్రూట్ ఫెస్టీ, నట్ ఫేస్టీ, చాక్లెట్ షిప్స్, చాకో డిలైట్, నోకట్ ఫెస్టీ, బటర్ స్కాచ్ తదితర పేర్లతో సుమారు 40కిపైగా రకాల కేకులు తయారు చేశారు.

కొత్త ఏడాది కలిసొచ్చేనా

2025 పూర్తిగా కలిసిరాకున్నా ఆశించిన ఫలితాలైతే రాలేదన్న అసంతృప్తి ఉంది. వచ్చే 2026 అయినా అన్ని విధాలుగా కలిసొచ్చేనా ప్రజలు ఆశగా కొత్త ఏడాదిలోకి అడుగు పెడుతున్నారు. 2025లో ప్రకృతి ఒడిదుడుకులతో రైతులకు పెద్దగా కలిసిరాలేదు. ఆరంభంలో వర్షాభావం, తరువాత అధిక వర్షాలు రెండింటితో వర్షాధార పంటలు ఆశించినంత రాలేదు. సాగు విస్తీర్ణం తగ్గింది. ఇదే నేపథ్యంలో సాగునీటి లభ్యత ఉండి సాగైన ఉద్యానవన పంటలకు ఏ పంటకూ మద్దతు ధర లభించలేదు. దీంతో పంట చేతికొచ్చినా రైతుకు మిగిలింది నష్టమే అయింది. ఇక ఈ ఏడాది రాజకీయంగానూ పెద్దగా కలసిరాలేదు. అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి నేతల మధ్య మాటల యుద్ధాలే కొనసాగాయి. ఆరోపణలు, ప్రత్యారోపణలతో నిత్యం రాజకీయ వేడిని రాజేస్తూ వచ్చాయి. అధికార టిడిపి ఈ ఏడాదిలో రాయలసీమ సభను అనంతపురం నగరంలో ఏర్పాటు చేసింది. సూపర్ సిక్స్ , సూపర్ సక్సెస్ పేరుతో నిర్వహించింది.రాజకీయంగానూ పెద్దగా మార్పులేవి ఈ ఏడాదిలో లేవు.

ఇళ్ల వద్దనే పింఛన్ల పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్టీఆర్ సామాజిక పింఛన్లను జిల్లా వ్యాప్తంగా అధికార యంత్రాంగం లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేసినట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ తెలియజేశారు. అనంతపురం నగరంలోని నవోదయ కాలనీలో గురువారం నాడు కలెక్టర్ స్వయంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతి నెలా పింఛన్లు జరుగుతున్న తీరుపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా జిల్లాలో సజావుగా పింఛన్ల పంపిణీ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, కార్పొరేటర్ ఎస్.రామాంజనేయులు, స్థానిక నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న కలెక్టర్ ఓ.ఆనంద్

జిల్లా వ్యవసాయ అధికారిగా రవి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా వ్యవసాయ అధికారిగా మీనల రవి బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా వ్యవసాయ అధికారిణిగా పని చేసిన యు.ఉమామహేశ్వరమ్మ ఉద్యోగ విరమణ పొందడంతో తాడిపత్రి వ్యవసాయ డివిజన్ ఎడిఎగా పని చేస్తున్న రవికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రవికి కార్యాలయ పరిపాలన అధికారి మునీర్‌అహ్మద్, సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్‌నాయక్, వంశీకృష్ణ, సునీత, శశికళ, ఎస్టాబ్లిష్‌మెంట్ సూపరిండెంటెంట్ బాలాజీనాయక్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణయ్య, రహంతుల్లా, ఆదాంఖాన్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా వ్యవసాయ అధికారిగా బాధ్యతలు చేపడుతున్న మీనల రవి

హాస్టళ్లను శుభ్రంగా ఉంచాలి

ఆహారం, తాగునీరు కలుషితం కానీయొద్దు:కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలు సంక్షేమ శాఖలపై సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్లలో ఎక్కడా ఫుడ్ పాయిజనింగ్ ఉండరాదన్నారు. అపరిశుభ్రత వల్ల ఎక్కడా పిల్లలు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పంచాయతీ సిబ్బంది ద్వారా నెలకు రెండుసార్లు పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సోషల్, బిసి వెల్ఫేర్ హాస్టళ్ల భవనాలు ఏవైనా కూలిపోయే స్థితిలో ఉంటే వెంటనే ఇతర ప్రభుత్వ భవనంలోకి పిల్లలను మార్చాలన్నారు. వికలాంగులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేసేందుకు చేపట్టిన యూడిఐడి సర్వేని డిఎంహెచ్ఓతో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి సమన్వయం చేసుకుని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్ లో పిఎఎల్ ల్యాబ్ లను ఉపయోగించడం మరింత పెంచాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో రెగ్యులర్‌గా గైర్హాజరు అవుతున్న విద్యార్థులతో కూడా సమన్వయం చేస్తూ ఎందుకు గైర్హాజరు అవుతున్నారో తెలుసుకుని శిక్షణ అందించి మంచి ఫలితాలు రావడానికి చర్యలు తీసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కింద మంజూరైన మరుగుదొడ్లను జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇకి సూచించారు. అలాగే రెవెన్యూ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఇప్పటికే ప్రభుత్వ బంజరు భూమి కోసం దరఖాస్తు చేసుకున్న 164 మంది మాజీ సైనికుల్లో వీలైనంత ఎక్కువ మంది అర్హులకు జనవరి 26వ తేదీన భూ మంజూరు పత్రాలను పంపిణీ చేసేందుకు వీలుగా డిఆర్ఓ, ఆర్డీవోలతో సమన్వయం చేసుకుని భూములను కేటాయింపజేయాలని ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్పకు సూచించారు. అనంతరం జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప వ్యక్తిగతంగా 500 పెన్నులను కలెక్టర్‌కు అందజేశారు. అంతకుముందు పిఎం ఆకాష్ గ్రామ్ యోజన (పిఎంఎ జివై)కు సంబంధించి కన్వర్జెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ జేడీ ఖుష్బూకొఠారి, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి తిమ్మప్ప, జెడ్పీ సీఈఓ శివశంకర్, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, డిఎండబ్ల్యూఓ రామ సుబ్బారెడ్డి, డీఈవో ప్రసాద్‌బాబు, డివిఇఓ వెంకటరమణ నాయక్, డిఆర్‌డిఓ పీడీ, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, వికలాంగుల సంక్షేమ శాఖ ఎడి అర్చన, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముద, మైనర్ ఇరిగేషన్ ఎస్ఇ విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

సామాజిక పింఛన్లతో పేదలకు భరోసా

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్లతో పేదలకు భరోసా వస్తోందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కడప రీజియన్ ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు తెలిపారు. బుధవారం నగరంలోని పలు కాలనీల్లో పర్యటించి ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా పింఛన్ లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెలా 1వతేదీన పింఛన్లు పంపిణీ చేస్తుండగా ఈసారి నూతన సంవత్సరం రావడంతో 31వతేదీనే పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక అనంతపురం పార్లమెంట్‌లోనే రూ.120కోట్లతో పింఛన్ సొమ్ము అందజేస్తున్నట్లు వివరించారు. అర్హతను బట్టి వృద్ధులు, వికలాంగులు, అనారోగ్య పరిస్థితుల్లో ఉన్నవారికి రూ.4 నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ బల్లా పల్లవి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఉరవకొండలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మండల అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. అనంతరం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నేటితో భారతదేశంలో పురుడు పోసుకుని 55 సంవత్సరాలు పూర్తయ్యి 56వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విద్యార్థిని విద్యార్థులు రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల అధ్యక్షులు ఎల్.రాజేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధార్థ, పోలేశ్వర్, అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.

విజయభాస్కర్ సేవలు మరువలేనివి..

జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ అరుణకుమారి

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం బిజినెస్ మేనేజర్ సేవలు మరువలేనివని జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ అరుణకుమారి, డిసిఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేశ్వర్లు కొనియాడారు. విజయభాస్కర్ ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం స్థానిక డిసిఎంఎస్ ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘమైన 34 సంవత్సరాల కాలవ్యవధిలో విజయభాస్కర్ అందరి సహకారంతో సమిష్టిగా అభ్యవృద్ధి వైపు సంస్థ నడిపించారన్నారు. 12ఏళ్ల ఐదు నెలలుగా బీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్‌గా అంకితభావంతో అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన సేవలో మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ సిబ్బంది సత్యనారాయణ, అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

అరుణకుమారి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పప్పుశనగ పంట దిగుబడి వచ్చేనా..?

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల వ్యాప్తంగా రైతులు సాగుచేసిన పప్పుశనగ పంటలో దిగుబడులు దక్కేనా అని ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ పంటలు ఎటు దక్కక తీవ్ర నష్టాలకు గురైన రైతులు రబీలో పప్పుశనగ పంటనైనా దక్కించుకోవాలని ఎంతో ఆశలతో సాగుచేయగా డిసెంబర్ రెండోవారంలో తుపాను ప్రభావంతో పంట దిగుబడులు తగ్గిపోయేలా ఉన్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని రావులుడికి, తెలికి, మేడిమాకులపలి, పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, లక్షుంపల్లి, ఆవులాంపల్లి, విరుపాపురం, కాశేపల్లి, దిమ్మగుడి, కండ్లగూడూరు చింతలచెరువు తదితర గ్రామాల్లో సుమారు రెండువేల ఎకరాల్లో పప్పుశనగ పంటను సాగు చేశారు. ప్రస్తుతం మొదటి వారంలో కోత పడే అవకాశాలు ఉన్నాయని, అయితే దిగుబడులు సన్నగిల్లడంతో ఈపంటలో కూడా తమకు నిరాశే ఎదురైందన్నారు. పప్పుశనగ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని రైతులు కోరారు.

రైతులు సాగు చేసిన పప్పుశనగ పంట

నేరాలు తగ్గుదల..!

22.5 శాతం తగ్గుముఖం - ఎస్పీ జగదీశ్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ఈ ఏడాది నేరాల్లో గణనీయంగా తగ్గుదల ఉన్నట్టు ఎస్పీ జగదీశ్ తెలిపారు. జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన నేరాలు గతేడాదితో పోలిస్తే 22.5 శాతం తగ్గుదల ఉన్నట్టు ఆయన తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పోలీసు కాన్ఫరెన్సు హాలులో జరిగిన మీడియా సమావేశంలో వార్షిక నేరాల వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఈ విధంగానున్నాయి.

22.5 శాతం నేరాల తగ్గుదల

జిల్లాలో 2024వ సంవత్సరంలో 8841 నేరాలు అన్ని రకాలు కలిపి నమోదయ్యాయి. ఈసారి 6851 కేసులు మాత్రమే నమోదయ్యాయి. మొత్తం కేసుల్లో 22.5 శాతం తగ్గుదల ఉంది. ఇందులో హత్యలు చూసినప్పుడు 2024వ సంవత్సరంలో 57 వాటికిగానూ 2025లో 42కు తగ్గాయి. హత్యాయత్నాలు గతేడాది 66కాగా ఈసారి 59 జరిగాయి. కిడ్నాప్ కేసులు మాత్రం స్వల్పంగా పెరిగాయి. అంతకు మునుపు ఏడాది 28 కిడ్నాప్‌లు జరిగాయి. ఈసారి 31 అయ్యాయి.

మహిళలపై హింస, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు

మహిళలపై జరిగిన హింస గతేడాది 733 కాగా ఈసారి 644 జరిగాయి. మహిళల హత్యలు గతేడాది 18 జరుగగా ఈసారి ఎనిమిది జరిగాయి. అత్యాచారాలు అంతకు ముందు 40 కాగా ఈ ఏడాది 37 జరిగాయి. మారిటల్ క్రైమ్ 413 కాగా ప్రస్తుతం 322 జరిగాయి. మొత్తంగా ఈ ఏడాది మహిళలపై హింస 25 శాతం తగ్గింది. పోక్సో కేసులు 2024లో 83 నమోదవగా ఈసారి 71 జరిగాయి. ఎస్సీ,ఎస్టీ సమస్యలపై నేరాలు 169 గతేడాది నమోదవగా ఈసారి 127 అయ్యాయి. ఈ కేసుల్లోనూ 25 శాతం తగ్గుదల ఉన్నట్టు ఎస్పీ జగదీశ్ తెలిపారు.

19.6కిలోల గంజాయి పట్టివేత

ఈ ఏడాది మొత్తంలో 19.6 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 51మంది నిందితులను అరెస్టు చేశారు. 13 ఎన్‌డిపిఎస్ కేసులు నమోదయ్యాయి. రెండు గంజాయి కేసుల్లో 22 మందికి జైలు శిక్ష ఖరారైంది. ఇక జూదంకు సంబంధించి 1342 మందిని అరెస్టు చేసి 3251 మందిని అరెస్టు చేశారు. రూ.1.74 కోట్లు నగదు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాలు ఈసారి తొమ్మిది శాతం తగ్గాయి. అంతకు మునుపు ఏడాది రోడ్డు ప్రమాదాలు 544 జరిగాయి. ఈసారి 496 జరిగాయి. గతంలో 343 మంది రోడ్డు ప్రమాదాల వల్ల చనిపోయారు. ఈసారి 291 మంది చనిపోయారు. క్షతగాత్రులు గతేడాది 652 మందికిగానూ ఈసారి 555 మంది గాయపడ్డారు.

అప్రమత్తత, అవగాహన

సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న హింస తదితర అంశాలపై పోలీసు శాఖ ద్వారా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా కల్పించామని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. గంజాయి వాడకం వలన ఏ రకంగా ఇబ్బందులు పడతారని యువతలో అవగాహన కల్పించే కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టినట్టు తెలిపారు. సైబర్ నేరాల భారినపడకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నది అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని వివరించారు. పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తమై నేరాలను అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాతీయ రహదారుల్లో ఫేస్‌వాష్ వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

సంక్షేమానికి పెద్ద పీట

పోలీసు సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేసినట్టు ఎస్పీ జగదీశ్ తెలిపారు. పిఎంజెజెబివై, పిఎంఎవై కింద బీమా పథకాలు, పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు,ఉచిత క్యాన్సర్ స్క్రీనింగు పరీక్షలు నిర్వహించామన్నారు. జీరో వడ్డీకే సంక్షేమ రుణాలు అందించామన్నారు. మొత్తంగా ఈ ఏడాది నేరాల సంఖ్యను చాలా వరకు తగ్గించాగలిగమాని ఎస్పీ వివరించారు.

బాలికల ఆశ్రమ పాఠశాలకు రూ.12కోట్లు మంజూరు

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మగట్ట మండలం గోనబావి వద్ద ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసినట్లు కాలవ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం రాయదుర్గంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ 2014-19 కాలంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు బాలిక విద్య ప్రోత్సహించేందుకు ఆడపిల్ల చదువుకోవాలని, కళాశాలకు పంపాలని ఉద్దేశంతో 'చదువుల ఒడి' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలో 1426 మంది బడి మానివేసిన ఆడపిల్లలను తిరిగి బడిలో చేర్పించామని గుర్తు చేశారు. అంతేగాకుండా బాలిక విద్యను ప్రోత్సహించేందుకు గోనబావి, డి.హీరేహాల్‌లో రెండు ఆశ్రమ పాఠశాలలను మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం ఆయా పాఠశాలల నిర్మాణాలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం పాఠశాల నిర్మాణ వ్యయం రూ.24 నుంచి రూ.35.73 కోట్ల వ్యయం పెరిగిందన్నారు. ఇప్పటికే పెట్టిన ఖర్చు కాకుండా అదనంగా మరో రూ.24కోట్లు అవసరం అవుతుందని అధికారులు అంచనా వేసినట్లు చెప్పారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ రాయదుర్గం పర్యటన సందర్భంగా అసంపూర్తిగా ఉన్న గోనబావి ఆశ్రమ పాఠశాల నిర్మాణాలను చూపినట్లు తెలిపారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన 50 వారాల సెల్ఫీ చాలెంజ్ లో తొలి ఛాలెంజ్ కార్యరూపం అవుబోతున్నందుకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ కన్వీనర్ బండి కృష్ణమూర్తి, మాజీ అధ్యక్షులు పసుపులేటి నాగరాజు, గుమ్మఘట్ట మండల కన్వీనర్ కాలవ సన్నన్న, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ టంకశాల హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నుంచి యువతను కాపాడుదాం

ప్రజాశక్తి-వజ్రకరూరు

బావిభారత పౌరులైన విద్యార్థులు, యువకులను గంజాయి మహమ్మారి నుంచి కాపాడి దేశ భవిష్యత్తుకు పునాదులు వేద్దామని ఉరవకొండ అర్బన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహానంది పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో యుటిఎఫ్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకప్పుడు కొన్ని వయసుల వారికి, కొన్ని వ్యవస్థలకే పరిమితమైన మత్తు పదార్థాలు నేడు యువత, విద్యార్థులను సైతం బానిసలు చేస్తోందన్నారు. అభం – శుభం తెలియని చిన్న పిల్లలు సైతం గంజాయికి బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగడంతోపాటు, దేశ భవిష్యత్తును కాపాడాల్సిన యువత గంజాయి మత్తుకు బానిసై వినాశకర దోరణల వైపు పయనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కార్యదర్శి శేఖర్, మండల నాయకులు రఘు, లక్ష్మీనారాయణ, ఉమాపతి, ప్రసన్నకుమార్, బండయ్య, నాగరాజు, శ్రీనివాసగుప్తా, జయరాములు, శ్రీధర్, శివ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అభివృద్ధి, సంక్షేమం, శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందని టిడిపి జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 2025లో కూటమి ప్రభుత్వం సాధించిన పురోగతి, ప్రజలకు అందిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ ఏడాది దాదాపు 65 దాకా పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం వినాశనం, విధ్వంసానికి ప్రతీక అయితే.. కూటమి ప్రభుత్వం వికాసానికి ప్రతీకగా నిలిచిందన్నారు. 18 నెలల్లో అమరావతి నిర్మాణం వేగవంతం కావడంతో పాటు రైల్వేజోన్, పోలవరం నిర్మాణం వంటివి కీలక దశకు చేరుకున్నాయన్నారు. దేశం మొత్తం ఎపి వైపు చూసే విధంగా పాలన సాగిందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణకుమార్, జిల్లా కార్యాలయ కార్యదర్శి తాజుద్దీన్, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్, జిల్లా మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ వృత్తి విద్య కోర్సులతో ఉద్యోగావకాశాలు

సర్టిఫికేషన్ అవార్డుల ప్రదానోత్సవంలో డాక్టర్ కెఎస్.అబ్దుల్‌రజాక్ గఫూర్

ప్రజాశక్తి-అనంతపురం

మెడికల్, వృత్తి విద్యాకోర్సులు చేయడం ద్వారా ఉద్యోగ అవకాశాలతోపాటు ఉద్యోగ పొందే అవకాశం ఎక్కువగా ఉందని డాక్టర్ కెఎస్ఆర్ గఫూర్ ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఆసుపత్రి ఛైర్మన్ అబ్దుల్‌రజాక్ గఫూర్ తెలిపారు. బుధవారం అనంతపురంలోని డాక్టర్ కెఎస్ఆర్ గఫూర్ ఇన్సిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఆసుపత్రిలో 2023-25 బ్యాచ్‌కు డిప్లొమా కోర్సుల సర్టిఫికేషన్ అవార్డు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ మెడికల్ కళాశాల డాక్టర్ పరదేశీనాయుడు, ఆదిరెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ మైక్రో బయాలజీ డాక్టర్ భరత్, ఫ్యాకల్టీ ఆఫ్ పైథాలజీ, బయో కెమిస్ట్రీ, ఎన్నారై విద్యాసంస్థల ఛైర్మన్ విశ్వనాథ్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కోర్సు చేసిన విద్యార్థులు కేవలం రెండేళ్లలోనే నెలకు రూ.35 నుంచి రూ.80వేల వరకూ సంపాదించుకో వచ్చన్నారు. అంతేగాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. డాక్టర్ చదవలేని పేద, మధ్య తరగతి విద్యార్థులు ఈ కోర్సుల ద్వారా డాక్టర్ వృత్తిలో కొనసాగించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, జిలాన్, మెడికల్ స్టాఫ్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లను అందజేస్తున్న అతిథులు

అనంతలో కిడ్నీ మార్పిడి

'సన్‌రే ఆసుపత్రి' వైద్యుల ఘనత

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని సన్‌రే ఆసుపత్రిలో ఒక అత్యంత అరుదైన వ్యాధి అమైలాయిడోసిస్‌తో బాధపడుతున్న రోగికి విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ రోహిత్‌రెడ్డి, డాక్టర్ సురేంద్రబాబు ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అమైలాయిడోసిస్ అనేది శరీరంలో అసాధారణ ప్రోటీన్ చేరిక వల్ల కిడ్నీలు సహా అనేక అవయవాలు దెబ్బతీసే అత్యంత అరుదైన వ్యాధి అన్నారు. ఇలాంటి వ్యాధిలో కిడ్నీ మార్పిడి చేయడం వైద్యపరంగా చాలా సవాల్‌తో కూడుకున్న విషయమన్నారు. సాధారణంగా ఈ తరహా కేసులు పెద్దపెద్ద నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకే పరిమితమవుతాయన్నారు. అలాంటి చికిత్సను అనంతపురంలోని సన్‌రే ఆసుపత్రిలో డాక్టర్ సురేంద్రబాబు, కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, వైద్య బృందం సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. శస్త్రచికిత్స అనంతరం రోగికి వెంటనే కిడ్నీ పని చేయడం ప్రారంభమైందన్నారు. ప్రస్తుతం రోగి, డోనర్ ఇద్దరూ సురక్షితంగా చికిత్స పూర్తి చేసుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ రోహిత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సన్‌రే ఆసుపత్రి వైద్యులు

అన్న క్యాంటీన్‌కు విరాళం

విరాళాన్నిస్కాన్ చేసి అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-గుత్తి

పిల్లెల్లి వెంకటేశ్వర్లు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారులు పిల్లెల్లి కృష్ణయ్య, శేఖర్, సురేష్ ఆధ్వర్యంలో బుధవారం అన్నా క్యాంటీన్‌కు స్కానర్ ద్వారా రూ.4వేలు విరాళం అందచేసినట్లు మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా తెలిపారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నా క్యాంటీన్ నిర్వహణకు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పి.రాంబాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ పి.మహబూబ్‌బాషా, టిడిపి నాయకుడు భాస్కర్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాల పునర్విభజనపై వైసిపి దుష్ప్రచారం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

మీడియాతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

జిల్లాల పునర్విభజన విషయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలు నమ్మేస్థితిలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం రాయదుర్గంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో జగన్ అనాలోచితంగా, స్వార్థపూరితంగా జిల్లాల విభజన చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ప్రజాప్రయోజనాలు, ప్రజా ఆకాంక్షలే ప్రాతిపదికగా జిల్లాల పునర్విభజన చేసినట్లు వివరించారు. దీన్ని వైసిపి నాయకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునేందుకు కుట్ర పన్నుతోందన్నారు. వైసిపికి రాజకీయాలే పరమావధి అన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి ప్రజలు, ప్రజా ప్రయోజనాలే ముఖ్యమన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు విలువనిస్తూ, ప్రజా అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని చేసిన జిల్లాల పునర్విభజన పూర్తిగా ప్రజా ఆమోదంతో చేసినదని స్పష్టం చేశారు. ముఖ్యంగా అన్నమయ్య జిల్లాపై వైసిపి అనవసర రాద్ధాంతం చేస్తోందన్నారు. జిల్లా పేరును ఎక్కడా తొలగించలేదని కేవలం జిల్లాకేంద్రాన్ని మదనపల్లికి మార్చారని వివరించారు. ఓవైపు రాజంపేట, మరోవైపు రైల్వేకోడూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షల ప్రకారం ఆ నియోజకవర్గాలను వేరే జిల్లాలోకి కలిపినట్లు చెప్పారు. రాయచోటి జిల్లా కేంద్రం కాకపోయినా దీని అభివృద్ధికి భవిష్యత్తులో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చినట్లు స్పష్టం చేశారు. మదనపల్లె జిల్లా కేంద్రం కావడం వల్ల ఇతరులకు ఎలాంటి నష్టం జరగదన్నారు. 28 జిల్లాలతో రాష్ట్ర స్వరూపం ఆయా ప్రాంతాల అవసరాలు, పరిస్థితులు, ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని చేసిందన్నారు. ఎలాంటి రాజకీయ స్వార్థం లేదని స్పష్టం చేశారు. ప్రజలు జిల్లాల పునర్విభజనను అర్థం చేసుకుని సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వివరించారు.

పూర్తిస్థాయిలో నిధులు ఖర్చు చేయాలి

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివృద్ధి కోసం ఆయా శాఖల పరిధిలో కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసేలా చూడాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కాంపోనెంట్ మానిటరింగ్ కమిటీ జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పథకంలో 17.08 శాతం ఎస్సీలు, 5.53 శాతం ఎస్టీలకు వ్యయానికి సంబంధించిన శాతం ఖచ్చితంగా ఖర్చు చేసేలా చూడాలన్నారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల వారికి కేటాయించిన లక్ష్యం మేరకు ప్రభుత్వం నుంచి అందే సహాయ, సహకారాలను పూర్తిస్థాయిలో అందేలన్నారు. డిఆర్‌డిఎ పరిధిలో స్త్రీనిధి కింద రుణాల మంజూరు, ఉన్నతి, పిఎంఎఫ్ఎంఇ లక్ష్యాలకు సంబంధించి పురోగతి తీసుకురావాలన్నారు. ఉపాధి హామీ కింద ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూర్చాలని, హౌసింగ్, ఎపిఎంఐపి, అగ్రికల్చర్, సివిల్ సప్లై, మున్సిపాలిటీ ఇతర అన్ని శాఖల పరిధిలో వారికి కేటాయించిన లక్ష్యాలను చేరుకోవడంపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ జేడీ ఖుష్బూ కొఠారి, డిటిడబ్ల్యుఒ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్‌చంద్, జెడ్పీ సీఈవో శివశంకర్, డిపిఒ నాగరాజునాయుడు, డిఆర్‌డిఎ పీడీ శైలజ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ సురేష్, డిసిఒ అరుణకుమారి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఇ శేషాద్రి శేఖర్, సిపిఒ అశోక్‌కుమార్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఇ విశ్వనాథ్‌రెడ్డి, హార్టికల్చర్ ఉమాదేవి, ఎపిఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముద, డ్వామా పీడీ విశ్వజ్యోతి, డిఎస్ఒ వెంకటేశ్వర్లు, డీఈవో ప్రసాద్‌బాబు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఓ.ఆనంద్

మాటలు కాదు.. పనితో పాలన..

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

రాష్ట్రంలో సాగుతోంది మాటల పాలన కాదని.. పనితో చేస్తున్న పాలన అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. ఈమేరకు ఏడాది కాలంలో తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను బుధవారం ఒక ప్రకటనలో వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రతివర్గానికి సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా తీసుకుని ముందుకెళుతున్నామన్నారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయన్నారు. తల్లికి వందనం పథకం కింద రూ.10,090కోట్లు విడుదల చేసి 67.27 లక్షల మంది విద్యార్థులకు నేరుగా సాయం అందిందని చెప్పుకొచ్చారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇప్పటి వరకు 3.25 కోట్ల ప్రయాణాలు సాగగా.. రూ.1,144 కోట్లు ఖర్చు చేసిందని వివరించారు. ఇక దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలులోకి వచ్చిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,310 కోట్లు జమ చేశామన్నారు. దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామనా్రను. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకానికి ఏడాదిలో రూ.33,000 కోట్లు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో పెన్షన్లకు ఇంతలా ఖర్చు చేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదే అన్నారు. ఇక మత్స్యకారులకు ఏడాదికి రూ.20వేల చొప్పున 1.25 లక్షల మందికి సాయం అందిచామన్నారు. నేతన్నలకు ఉచిత విద్యుత్ అమలు చేశామని, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల ఆర్థికసాయం అందించి 2.90 లక్షల మందికి లబ్ధి చేకూరిందని చెప్పుకొచ్చారు. వైసిపి ప్రభుత్వం మూసేసిన అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించామన్నారు. గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం కేటాయించినట్లు తెలిపారు. మైనారిటీల సంక్షేమానికి ఈ ఏడాది రూ.3,670 కోట్లు కేటాయించామన్నారు. పాస్టర్లకు గౌరవ వేతనం, ఇమామ్‌లు, మౌజన్లకు ఆర్థికసాయం అందించామన్నారు. పురోహితులు, నాయీ బ్రాహ్మణుల వేతనాలు పెంచామన్నారు. వీటితోపాటు అనేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్లు వివరించారు.

ఎఐ ఆధారిత ఎంఆర్ఐ స్కాన్ ప్రారంభం

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిమ్స్ సవీర ఆసుపత్రి సేవలు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోనే మొట్ట మొదటిసారిగా నగరంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఎఐ ఆధారిత ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్‌ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి దేవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడంలో ఎఐ ఎంఆర్ఐ స్కాన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సిస్టమ్ ద్వారా మరింత స్పష్టమైన, అధిక క్లారిటీ కలిగిన ఇమేజెస్ లభిస్తాయన్నారు. దీంతో వ్యాధి నిర్ధారణ సులభతరం అవుతుందని వివరించారు. అనంతపురం, హిందుపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ టిసి.వరుణ్ మాట్లాడుతూ ఎఐ ఆధారిత ఆధునిక వైద్య సాంకేతికత జిల్లాకు రావడం గర్వించదగిన విషయమన్నారు. రేడియాలజీ విభాగానికి చెందిన వైద్యులు వివి.శ్రీకృష్ణ, వై.మధుమాధవ్, టి.హరీష్, సి.దీపా మాట్లాడుతూ 1.5 టెస్లా ఎంఆర్ఐ సిస్టమ్ 60 సెంమీ ఫ్లేర్డ్ బోర్‌తో రూపొందించినట్లు తెలిపారు. ఇది రోగులకు అధిక సౌకర్యాన్ని అందించడంతోపాటు, తక్కువ సమయంలో ఎక్కువ స్కాన్లు నిర్వహించే సామర్థ్యం కలిగి ఉందన్నారు. 24/7 అన్ని రకాల ఎంఆర్ఐ స్కానింగ్ అందుబాటులో ఉంటాయని వివరించారు. అలాగే ఒక్క-క్లిక్ ఏఐ పోస్ట్-ప్రాసెసింగ్ ద్వారా ఖచ్చితమైన, స్పష్టమైన ఫలితాలు లభిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ సవీరా ఆసుపత్రి ఎండీ ఎస్‌వి.కిషోర్‌రెడ్డి, సిఇఒ పిఎస్.ప్రసాద్, సిఒఒ సిద్ధారెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ అబిబ్‌రాజా, తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ ఇబి దేవి

సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ఉషారాణి

పౌరహక్కులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

రాజ్యాంగం ఇచ్చిన పౌరహక్కులను కాపాడుకోవాలని తహశీల్దార్ ఉషారాణి సూచించారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని ముప్పాలగుత్తి ఎస్సీకాలనీలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మీకు కల్పించిన హక్కులను వినియోగించుకోవడంతో పాటు కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలనా్రను. అనంతరం కాలనీలోని మహిళలు, ప్రజలు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శ్రీదేవి, డాక్టర్ శ్రీనివాసబాబు, వీఆర్వో సుంకన్న, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన సంవత్సరంలో ఆనందాలు వెల్లివిరియాలి

ప్రజాశక్తి-అనంతపురం

నూతన సంవత్సరంలో ప్రజల్లో ఆనందాలు వెల్లివిరాయలని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆకాంక్షించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రతి ఇంట్లో ఆనందాలు.. ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లి విరియాలని కోరారు. 2026లో ప్రజలకు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలిగి, సుఖసంతోషాలతో ఉండాలన్నారు.

3న వేలంపాట

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయానికి సంబంధించి గ్రామంలో పూజా సామగ్రి విక్రయించడానికి, సప్లయర్స్ సామాన్లు బాడుగులకు ఇచ్చుకోవడానికి జనవరి 3వతేదీ శనివారం ఆలయ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి సాకేతపురం శోభ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలనుకునే వారు సప్లయర్స్ సామాన్ల కోసం రూ.50వేలు, పూజా సామగ్రి విక్రయానికి రూ.50వేల ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలి

ప్రజాశక్తి- పెద్దవడుగూరు

ఇదే స్ఫూర్తి.. రెట్టించిన ఉత్సాహంతో మున్ముందు మరింతగా పని చేయాలని ఎస్పీ జగదీష్ పోలీసు అధికారులకు పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం ఎస్పీ కార్యాలయంలో విధి నిర్వహణలో ప్రతిభ చూపిన ఎస్ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ నబిరసూల్, కానిస్టేబుల్ కిషోర్‌కు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగాఎస్పీ మాట్లాడుతూ కేసులను సమర్థవంతంగా పరిష్కరించినప్పుడే ప్రజల్లో పోలీసు శాఖపై గౌరవం పెరుగుతుందన్నారు.

ప్రశంసాపత్రాన్ని అందుకంటున్న ఎస్ఐ

నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-గుత్తి

శాంతిప్రియ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శాంతిప్రియ ఆధ్వర్యంలో గుత్తిలో బుధవారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని శాంతిప్రియ ఆసుపత్రిలో వైసీపీ యువనేత సిబి.మంజునాథ్ రెడ్డి, గుత్తి పట్టణ కన్వీనర్ కె.మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబి, వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, వైసిపి మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు చంద్రగిరి రాధాయాదవ్‌తోపాటు పలువురు భారీ కేకు కోసం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వి.వరద, వాల్మీకి శివ, నరేష్, రమణ, వైసిపి నాయకులు సి.మల్లయ్యయాదవ్, వై.సుభాష్‌రెడ్డి, బి.గురు ప్రసాద్ యాదవ్, సివి.రంగారెడ్డి, ఎం.రంగస్వామి, జీపు రమణ, విశ్వనాథరెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేక్ కోస్తున్న అతిథులు

5న ఎంపిపి ఎన్నిక

బొమ్మనహాల్ : మండల ఎంపిపిగా పని చేసిన పద్మ రాజీనామా చేయడంతో ఈనెల 5వతేదీన ఎంపిపి ఎన్నికల నిర్వహించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినట్లు స్పెషలాఫీసర్, భూగర్భజలాల డిఇ గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఎంపిపిగా నాగరత్నమ్మ కొనసాగుతోందన్నారు. ఈమేరకు 16 మంది ఎంపిటిసిలకు నోటీసులు ఇచ్చి 5వతేదీన తప్పనిసరిగా హాజరు కావాలని పంచాయతీ కార్యదర్శి ద్వారా సమాచారం పంపినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-యల్లనూరు

ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మండలంలోని పలువురు నాయకులు, అధికారులు బుధవారం ఆవిష్కరించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ రాము, వైసిపి నియోజకవర్గ ఎస్ఇసి అధ్యక్షులు బోగాతి నారాయణరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగాతి విజయ్‌ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్తాపత్రికల్లో ప్రజాశక్తి దినపత్రికకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర ప్రయత్నాలు ముమ్మరం చేసే ఏకైక పత్రిక ప్రజాశక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రైతుల సమస్యలు తెలుసుకున్న శైలజనాథ్

రైతులతో మాట్లాడుతున్న శైలజనాథ్

ప్రజాశక్తి-పుట్లూరు

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్ బుధవారం మండల కేంద్రంలో రైతులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా సకాలంలో చెరువులకు నీళ్లు అందక రైతులు పడుతున్న కష్టాలపై ఆరాతీశారు. తర్వాత హెచ్చెల్సీ అధికారుకాలతో మాట్లాడారు. తర్వాత మండల కేంద్రంలో ఉన్న దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, మండల కన్వీనర్ మహేశ్వర్‌రెడ్డి, రైతులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 'కూటమి' పాలన

విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగానే చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని 24, 25 వార్డుల పరిధిలో చేపట్టిన పింఛన్ల పంపిణీలో విప్ పాల్గొని పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సర శుభారంభాన్ని పురస్కరించుకుని ఈనెల ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ఖజానాపై అప్పుల భారం మోపి వెళ్లిపో యినా... ముఖ్యమంత్రి చంద్రబాబు తనకున్న పాలన అనుభవం, పరిపాలన సా మర్థ్యంతో పెద్ద ఎత్తున వివిధ మార్గాల్లో నిధులను సమీకరించి సంక్షేమం తోపాటు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఉజ్వలమైన భవిష్యత్తు దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నడిపిస్తున్న సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబే నన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బండి కృష్ణమూర్తి, వార్డు ఇన్‌ఛార్జి వెంకటేశులు, రవి, హనుమంతు, పురుషోత్తం, వెంకటేశులు, నాగరాజు, సుమలత, తిప్పేస్వామి, రఘు తదితరులు పాల్గొన్నారు.

TADIPATRI MUNICIPALITY
"e" Procurement Notice
62 & 63/2025-26/GENERAL/E1 (2nd Call)
Municipal General Fund 02 Nos works with value of 24.00 Lakhs download Starting Date:01-01-2026 at 10:00 A.M & Last Date:07-01-2026 at 04:00 P.M and details of the Name of work, Tender Document, Eligibility Criteria and EMD details etc., may be seen on e-procurement.
website: tender.apeprocurement.gov.in
Any further information contact (in office hours): +91 8096901750
Sd/- Commissioner
Tadipatri Municipality

సామాజిక పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-అనంతపురం

ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ఆదేశాల మేరకు 42వ డివిజన్ టిడిపి యూనిట్ ఇన్‌ఛార్జి ఓంకార్ రెడ్డి సచివాలయ సిబ్బందితో కలిసి బుధవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోయ శ్రీనివాసులు, 42 డివిజన్ అధ్యక్షులు ఇ.రామాంజనేయులు, మెడికల్ బాబా, కురుబ సంజీవ్‌కుమార్, చంద్రమౌళినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ అందజేస్తున్న ఓంకార్‌రెడ్డి

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో బుధవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద లబ్ధిదారులకు ఎపి కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ జి.వెంకటశివుడు యాదవ్, మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్ మియా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ పి.రాంబాబు, విఆర్ఒ నాగరాజు, ఎపి ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ జిబి.పవన్‌కుమార్ యాదవ్, టిడిపి నాయకులు కరిడికొండ సుధాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల పరిధిలోని సోదనపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో టిడిపి నాయకులు అట్టే రామాంజనేయులు, గ్రామ కమిటీ అధ్యక్షులు ఏకిల ఆదినారాయణ, తదితరులు పాల్గొని పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయిచరణ్, వీఆర్వో శ్రీనివాసరావు, అట్టే శ్రీనివాసులు, అట్టే శంకర, జానుకొండ శ్రీనివాసులు, ఏకిల ఎర్రిస్వామి, చిన్న చౌడప్ప, ఈడిగ లక్ష్మయ్య, సచివాలయ సిబ్బంది, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు

అలాగే మండల పరిధిలోని చిన్న జలాలపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సుధాకర్, అక్కులప్ప, గోపాల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి-2025 సదస్సులో 'గేట్స్'కు పురస్కారం

ప్రజాశక్తి-గుత్తి

విజయవాడలో జరిగిన బ్రిడ్జి-2025 సదస్సులో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు గౌరవ పురస్కారం లభించింది. ఐసిటి అకాడమీతో కలిసి సియెంట్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ అభివృద్ధి, ఐఎంబి స్కిల్స్ బిల్డ్ సహకారంతో శిక్షణ కార్యక్రమాలను బిటెక్, పాలిటెక్నిక్ విద్యార్థులు విజయవంతం చేసినందుకు విజయవాడలో జరిగిన బ్రిడ్జి-2025 సదస్సులో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు గౌరవ పురస్కారం దక్కింది. ఈమేరకు ఐటిసి అకాడమీ సిఇఒ శ్రీకాంత్, కాకినాడ జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రసాద్‌తో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్ మెంట్ అధికారి తన్వీర్ అభినందనపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ నమ్రత మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యాధారిత శిక్షణ ఇవ్వడంతో పాటు పరిశ్రమ-విద్యాసంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడంలో బృందం చేసిన కృషిని ప్రశంసించారు.

పురస్కారం అందుకుంటున్న తన్వీర్

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని 3వరోడ్డులో ఉన్న సాయివిజ్ఞాన్ పాఠశాలలో ముందస్తుగా బుధవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు ఎంపి.శ్రీనివాసులు, సి.కరుణాకర్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.లావణ్యారామ్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే నగరంలోని నామాటవర్స్ వీధిలో ఉన్న లోటస్ కిడ్స్ అమెరికన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు.